హామీలు మరిచారు..



కూటమి ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామని సూపర్ సిక్స్‌లో భాగంగా హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక ఆ మాటే మరచిపోయారు. ఎన్నికల సమయంలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం మంచి పద్ధతి కాదు. అధికారంలోకి రావడం కోసం మోసపూరిత హామీలు ఇచ్చి ఇప్పుడు అమలు చేయకుండా కూటమి ప్రభుత్వం కాలయాపన చేస్తోంది.

- కుసుమ వరలక్ష్మి, గృహిణి, మాచవరం

రైతులను గాలికొదిలేశారు



కూటమి నాయకులు రైతు ప్రభుత్వం అని దప్పుకొట్టుకోవడమే తప్ప ఆచరణలో కనిపించడం లేదు. ఎన్నికల సమయంలో అన్నదాత సుఖీభవ పథకంలో పెట్టుబడి సాయం కింద రూ.20 వేలు ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక రైతుల గురించి పట్టించుకునే వారు లేరు. కూటమి ప్రభుత్వం పెట్టుబడి సాయం ఇస్తుందని ఎదురుచూసి మోసపోయాం. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పెట్టుబడి సాయం సకాలంలో అందించి నాలుగేళ్లు రైతులను ఆదుకుంది.

- దొమ్మేటి రాధాసూర్యనారాయణ, రైతు, ఇరుసుమండ

'తల్లికి వందనం'పై స్పష్టత లేదు



పిల్లల్ని బడిలో చేర్పించి వంద రోజులు కావస్తున్నా ఇంకా తల్లికి వందనం సాయంపై ప్రభుత్వం స్పందించడం లేదు. ఎన్నికల్లో సూపర్‌సిక్స్ అంటూ ఆర్భాటంగా ప్రచారం చేశారు. కానీ అమలుకు వచ్చేసరికి దీనిపై చిత్తశుద్ధి కనిపించడం లేదు. హామీలు అమలు చేయకుండా జాప్యం చేయడం కూటమి ప్రభుత్వానికి మంచిది కాదు. ప్రభుత్వం అందించే సాయం తమకు ఆసరాగా ఉంటుందనుకుంటున్న తరుణంలో ప్రభుత్వం పట్టించుకోకపోవడం ఆందోళన కలిగిస్తుంది.

- ఆర్‌ఎం మీనా, గృహిణి, పినపళ్ల

నోరు మెదపరే..




తల్లికి వందనం పేరిట ఎంత మంది పిల్లలు చదువుకుంటున్నా ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15 వేల చొప్పున ఇస్తామని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావొస్తుంది. కానీ ఇంత వరకూ ఆ హామీపై నోరు మెదపడం లేదు. నాకు ఇద్దరు పిల్లలు. వానే ప్రైవేటు స్కూల్లో చదువుకుంటున్నారు. నాకు ఏడాదికి ఇద్దరికి కలిపి రూ.30 వేలు అందాల్సి ఉంది. తల్లికి వందనం సహాయాన్ని వెంటనే ఖాతాల్లో జమ చేయాలి.

- తోట ప్రసాద్, మామిడికుదురు

బాబు ష్యూరిటీ.. నో క్లారిటీ

పథకాల అమలులో మీనమేషాలు ● ఆశగా ప్రజల ఎదురుచూపులు



మామిడికుదురు: సూపర్ సిక్స్ పథకాల ద్వారా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తామంటూ టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు ఎన్నికల సందర్భంగా ప్రతి గల్లీలో హామీల వర్షం కురిపించారు. ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా హామీలు ఇచ్చి ప్రజల్ని ఆకర్షించారు. అన్నదాతా సుఖీభవ ద్వారా ఏడాదికి ప్రతి రైతుకు రూ.20 వేల ఆర్థిక సహాయం, ఎంత మంది పిల్లలు ఉన్నా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక భరోసా, ఏడాదికి ఉచితంగా మూడు గ్యాస్ సిలిండర్లు, మహిళలకు ఫ్రీ బస్ సదుపాయం, నిరుద్యోగ భృతిగా రూ.3 వేలు, ప్రతి మహిళకు నెలకు రూ.1,500 సహాయం ఈ విధంగా సూపర్ సిక్స్ పథకాల పేరిట ప్రజల్ని ఆకట్టుకున్నారు. కూటమి హామీలను ప్రజలు నమ్మారు. కూటమి పాలన ప్రారంభమై 100 రోజులు కావొస్తున్నా సూపర్ సిక్స్ పథకాల మాట మాత్రం ఎక్కడా ప్రస్తావించడం లేదు. పైగా సూపర్ సిక్స్ అమలు చేయాలంటే భయమేస్తోంది. వీటిపై ప్రజలు ఆలోచన చేయాలంటేనే భయంగా ఉందంటూ సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శాసనసభలో మాట్లాడటం చూస్తుంటే పథకాల అమలుపై కూటమి నేతల చిత్తశుద్ధిని శంకించాల్సి వస్తోందని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పథకాలు అమలు చేయించే బాధ్యత నాది అని భరోసా ఇచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇప్పుడు ఈ అంశాలపై నోరు మెదపకపోవడంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు.


ప్రతి మహిళకు నెలకు రూ.1,500



నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	68,540
కొత్తపేట	78,914
రాజోలు	86,909

నెలకు ఇవ్వాల్సిన సాయం: 35.15 కోట్లు

మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం



నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	1,20,200
కొత్తపేట	1,40,000
రాజోలు	1,10,000

ఏటా మూడు సిలిండర్లు ఉచితం




నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	77,766
కొత్తపేట	92,543
రాజోలు	68,213

ఇంటికో ఉద్యోగం ఏమైంది



ఇంటికో ఉద్యోగం అన్నారు కదా. దాని సంగతి ఏమిటి. ఇచ్చిన హామీలను మర్చిపోయారా. సూపర్ సిక్స్‌తో పేదల తలరాతలు మారుస్తామంటే నిజమని నమ్మాం. కానీ ఇచ్చిన హామీలపై ఎందుకు మాట్లాడడం లేదు. మెగా డీఎస్సీ అని ప్రకటించారు. అంతా హడావుడి, ప్రచారం తప్ప దానిలో మెగా ఎక్కడ ఉంది. స్వల్పంగానే పోస్టులు భర్తీ చేస్తున్నారు. పోస్టుల భర్తీలో కూడా తీవ్ర జాప్యం. హామీలు ఇస్తారు కానీ అమలు చేయరన్న దానికి కూటమి ఉదాహరణగా నిలుస్తుంది.

- నవుండ్రు దుర్గావెంకటేశ్వరరావు, విలస




జగన్ పాలనలో ఒక్కో ఏడాది రైతులకు అందిన సాయం

నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
పి.గన్నవరం	11.79
కొత్తపేట	14.09
రాజోలు	11.07

కూటమి పాలనలో ఎదురుచూస్తున్న రైతులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	27,388
కొత్తపేట	26,920
రాజోలు	24,667



జగన్ పాలనలో ఒక్కో ఏడాది తల్లికి అందిన సాయం

పథకం	నియోజకవర్గం	లబ్ధి (రూ.కోట్లలో)
అమ్మఒడి	పి.గన్నవరం	27.60
	కొత్తపేట	28.46
	రాజోలు	22.54

కూటమి పాలనలో సాయం కోసం ఎదురుచూస్తున్న తల్లులు

నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	18,402
కొత్తపేట	25,192
రాజోలు	16,508

యువతకు నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి



నియోజకవర్గం	లబ్ధిదారులు
పి.గన్నవరం	65,341
కొత్తపేట	82,144
రాజోలు	58,413

నిరుద్యోగ భృతి మళ్లీ మోసమేనా..



ఎన్నికల్లో కూటమి నేతలు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా నిరుద్యోగ భృతి హామీ కూడా ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక నిరుద్యోగ భృతిపై మాట్లాడటం లేదు. నిరుద్యోగులను నమ్మించి అధికారంలోకి వచ్చాక ఆ విషయం ప్రస్తావించకపోవడం దారుణం. వేలాది మంది నిరుద్యోగులు కూటమి ప్రభుత్వంపై ఆశలు పెట్టుకున్నారు. నిరుద్యోగ భృతి తక్షణం అందజేయాలి. తద్వారా కూటమి నేతలు తమ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి.

- ఆకుల శివ, కేశనపల్లి

ఉచిత బస్సు ప్రయాణమేది?



కూటమి నేతలు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అంటూ ఎన్నికల్లో ప్రతి ఇంటికి వచ్చి హామీ ఇచ్చారు. ఆ హామీని ప్రజలు నమ్మి ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి వంద రోజులు కావొస్తుంది. కానీ ఇంత వరకూ దాని ప్రస్తావనే లేదు. ప్రభుత్వం కాకమ్మ కబుర్లు చెబుతూ కాలక్షేపం చేస్తుంది. కానీ ఇచ్చిన హామీలను అమలు చేయాలన్న తలంపు ఎక్కడా కనిపించడం లేదు. అమలు చేస్తారా, లేదా. మరెందుకు హామీ ఇచ్చి ఓట్లు వేయించుకున్నారు.

- చేట్ల లక్ష్మి, మాగం, అయినవిల్లి మండలం

నెలకు రూ.1,500 ఎప్పుడిస్తారు



అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి మహిళకు నెలకు రూ.1,500 ఇస్తామన్నారు. సూపర్ సిక్స్ అంటూ ఎన్నికల్లో ఊదరగొట్టారు. ఆ ప్రచారాన్ని అందరూ నమ్మి ఓట్లు వేశాం. కానీ అధికారంలోకి వచ్చాక. సూపర్ సిక్స్ అంటే భయమేస్తోందంటూ సీఎం అసెంబ్లీ సాక్షిగా మాట్లాడటం ఎంత వరకు భావ్యం. మీరు ఏమీ ఆలోచించకుండానే ఎలా హామీ ఇచ్చారు. అధికారం కోసం ఇలా తప్పుడు హామీలు ఇస్తారా. ఇదేనా మీ సీనియారిటీ, సిన్సియారిటీ.

- తాడి అరుణ, కేశనపల్లి

క్లుప్తంగా

వాడపల్లిలో అష్టోత్తర పూజలు



వాడపల్లిలో అష్టోత్తర పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆత్రేయపురం: వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో సోమవారం స్వామివారి అష్టోత్తర పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో అన్నసమారాధన జరిగింది. ఈ ఏర్పాట్లను ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ పర్యవేక్షించారు.

అయినవిల్లి: నేదునూరులో చెన్నమల్లేశ్వర స్వామి ఆలయంలో చండీ హోమం జరిగింది. ఆలయ అర్చకుడు వెలవలపల్లి సత్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో వేద పండితులు పూజలు చేశారు.

విద్యార్థులకు చేయూత

పి.గన్నవరం: స్థానిక గ్రేస్ విద్యా సంస్థల ప్రిన్సిపల్ పీవీఆర్ నాయుడు బుధవారం ఊడిమూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు స్టీలు కంచాలు పంపిణీ చేశారు. నాగుల్లంక వృద్ధాశ్రమంలో వృద్ధులకు, పి.గన్నవరం సామాజిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పులిహోర ప్యాకెట్లు, పండ్లు అందజేశారు.

మలికిపురం: దిండి ఆర్‌వీఆర్ సరోవర్ పోర్టికో అధినేత ఆర్‌పీ రాజు జన్మదినం సందర్భంగా గ్రామంలో సుమారు 900 మందికి క్యారియర్‌లు పంపిణీ చేశారు.

సామూహిక సీమంతాలు

పి.గన్నవరం: ఊడిమూడిలో సర్పంచ్ నూకపెయ్యి ప్రసన్నకుమార్ ఆధ్వర్యంలో ఐసీడీఎస్ పి.గన్నవరం ప్రాజెక్ట్ సీడీపీఓ డి.వెంకటేశ్వరి పర్యవేక్షణలో గర్భిణులకు సామూహిక సీమంతాలు చేశారు.

ఆలమూరు: చింతలూరులో అంగన్‌వాడీ కార్యకర్తలు, సమాఖ్య ప్రతినిధులు, ఎన్.ధనలక్ష్మి, డి.రామలక్ష్మి, కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలకు చెందిన 12 మంది గర్భిణులకు సీమంతాలు చేశారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ఆలమూరు: పినపళ్ల, సంధిపూడి గ్రామాల్లో బుధవారం కుష్ఠు వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. డీపీఎంఓ సీహెచ్ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లోని ఆయుష్మాన్ భారత్ మందిరాల వద్ద ఈ పరీక్షలు చేశారు.

విఘ్ననాయకా భజేహం..



మామిడికుదురులో వినాయకుడి విగ్రహ ఊరేగింపు

ఆలమూరు: వినాయక చవితి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆయా మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను బుధవారం నిమజ్జనం చేశారు. జొన్నాడ గౌతమీ గోదావరిలోని పుష్కరఘాట్, మడికి పెద్ద కాలువ వద్ద నిమజ్జనాలు జరిగాయి. సంధిపూడిలోని విజయ గణపతి ఆలయం వద్ద 51 కిలోల లడ్డూకు వేలంలో రూ.12500 వచ్చింది. పినపళ్లలో విఘ్నేశ్వర ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది.

మామిడికుదురు: స్థానిక సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాన్ని ఊరేగించారు. తాటిపాక శ్రీలక్ష్మి థియేటర్ వద్ద శ్రీలక్ష్మీ గణపతి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వినాయక విగ్రహాన్ని పాశర్లపూడి వైనతేయ గోదావరిలో నిమజ్జనం చేశారు.

పి.గన్నవరం: ఎల్.గన్నవరం వేమనవారిపాలెంలో భద్రాద్రి చతుర్భుజ సీతా రామాలయం వద్ద గణపతి మండపంలో విగ్రహాన్ని వైనతేయ నదిలో నిమజ్జనం చేశారు. స్వామి వారి లడ్డూను వేమన ఫణిబాబు సోదరులు రూ.12 వేలకు దక్కించుకున్నారు. బోడపాటి వారిపాలెంలో, స్థానిక ఏటిగట్టు సెంటర్లో అన్న సమారాధన జరిగింది.


మలికిపురం: వుయ్యూరివారి మెరక గాంధీనగర్‌లోని వినాయక ఆలయంలో లడ్డూను మలికిపురానికి చెందిన కేవీ సుబ్రహ్మణ్యేశ్వర వర్మ రూ.23,500కు వేలంలో దక్కించుకున్నారు. మలికిపురంలో వినాయక ఆలయం వద్ద అన్న సమారాధన జరిగింది.

అంబాజీపేట: స్థానిక సత్యసాయి నగర్‌లో గణపతి ఆలయం వద్ద నృత్య ప్రదర్శనలు అలరించాయి. తొలుత గణనాథునికి గరిక పూజ చేశారు. బండారువారి వీధి వద్ద అన్న సమారాధన జరిగింది.

కొత్తపేట: కొత్తపేటతో పాటు వివిధ గ్రామాల్లోని గణేష్ విగ్రహ నిమజ్జనోత్సవాలు జరిగాయి. అనంతరం స్థానిక ప్రధాన పంట కాలువల్లో విగ్రహాలను నిమజ్జనం చేశారు.

అయినవిల్లి: తొత్తరమూడి జైభీమ్ నగర్‌లో మహా గణపతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అన్న సమారాధన జరిగింది.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



మలికిపురంలో జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించిన విద్యార్థులు

అంబాజీపేట: మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదపడతాయని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బూడిద వరలక్ష్మి అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అంబాజీపేట జెడ్పీ హైస్కూల్‌లో ఎంఈఓ-1 కాండ్రేగుల వెంకటేశ్వరరావు అధ్యక్షతన మండల స్థాయి క్రీడాకారుల ఎంపిక పోటీలను బుధవారం నిర్వహించారు. ఎంఈఓ-2 మోకా ప్రకాష్, హెచ్ఎం కడలి సాయిరామ్ మాట్లాడుతూ మండలంలోని 11 హైస్కూళ్ల నుంచి విద్యార్థులు పాల్గొన్నారన్నారు. మండల స్పోర్ట్స్ డెవలప్‌మెంట్ అధికారి అందె సూర్యనారాయణ మూర్తి ఆధ్వర్యంలో అండర్-14, 17 విభాగాల్లో బాలురు, బాలికలకు వివిధ పోటీలు నిర్వహించారు. సర్పంచ్ నాగాబత్తుల శాంతకుమారి, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల ఇంద్రశేఖర్, ఎంపీటీసీల మండల సమాఖ్య అధ్యక్షుడు ముత్తాబత్తుల ప్రశాంత్, ఎస్ఎంసీ చైర్మన్ పితాని త్రిమూర్తులు పాల్గొన్నారు.

అయినవిల్లి: ముక్తేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్కూల్ గేమ్స్‌ను జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరావు ప్రారంభించారు. వివిధ పోటీలు నిర్వహించారు. నాయకులు దామిశెట్టి బుజ్జి, పినిపే బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

మలికిపురం: స్థానిక డిగ్రీ కళాశాలలో నియోజకవర్గ స్థాయి అండర్-14, 17 విభాగంలో బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపికలు బుధవారం జరిగాయి. సుమారు 80 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు ఈ నెల 30న జరిగే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు ఎంపికలకు అర్హత సాధిస్తారు. నియోజకవర్గ కో ఆర్డినేటర్ సుధాకర్, విశ్రాంత ఎంఈఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాల్ బ్యాడ్మింటన్‌కు పుట్టినిల్లు 'రాజోలు'



అందుకున్న స్టార్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

రాజోలు: బాల్ బ్యాడ్మింటన్‌కు రాజోలు పుట్టినిల్లుగా నిలిచిందని సీనియర్ న్యాయవాది వాడ్రేవు పాపయ్యపంతులు అన్నారు. రాజోలు యూత్‌క్లబ్ ఆవరణలో 1975 సంవత్సరంలో ఆల్ ఇండియా యూనివర్సిటీ స్థాయిలో విజేతలుగా నిలిచిన అప్పటి బాల్ బ్యాడ్మింటన్ టీం ఆత్మీయ సమ్మేళనం జరిగింది. వ్యాయామ ఉపాధ్యాయుడు పుట్టా రామకృష్ణ ఆధ్వర్యంలో ఐదు దశాబ్దాల తర్వాత బాల్ బ్యాడ్మింట్ క్రీడాకారులు కలుసుకున్నారు. ఆల్ ఇండియా క్రీడాకారుడు ముంబాయి బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు హనుమంతరావు మాట్లాడుతూ ప్రభుత్వం బాల్ బ్యాడ్మింటన్ క్రీడను ప్రోత్సహించాలన్నారు. స్టార్ క్రీడాకారులను సీనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు కాశిన వీరభద్రరావు (పతి), న్యాయవాది పాపయ్య పంతులు సత్కరించారు. ఆల్ ఇండియా క్రీడాకారులు కె.రాంబాబు, పి.హనుమంతరావు, నిడదవోలు రాంబాబు, రామ్‌గోపాల్, సూరిబాబు రాజు, మాగంటి మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

మరిన్ని అవార్డులు సాధించాలి

కొత్తపేట: బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వులుసు సుబ్బారావు మరిన్ని అవార్డులు సాధించాలని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. ఇటీవల శ్రీశ్రీ కళావేదిక జాతీయ స్థాయిలో తెలుగు జాతి కీర్తి శిఖరం ఎన్టీఆర్ అనే శీర్షికతో కవిత పోటీలు నిర్వహించగా డాక్టర్ సుబ్బారావు టాప్ టెన్ విజేతగా నిలిచారు. దానిని పురస్కరించుకుని వాడపాలెంలో ఎమ్మెల్యే బుధవారం ఆయన్ని సత్కరించారు.

జ్ఞాన కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు

అంబాజీపేట: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందని ఎంఈఓ 1, 2లు కాండ్రేగుల వెంకటేశ్వరరావు, మోకా ప్రకాష్ అన్నారు. అంబాజీపేట జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలు హెచ్ఎం కడలి సాయిరామ్ అధ్యక్షతన నిర్వహించారు.

ఉత్తమ ఉపాధ్యాయుడికి సన్మానం

మామిడికుదురు: ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న గోగన్నమఠంలోని ముత్యాలపాలెం ఎంపీపీ స్కూల్ హెచ్ఎం కడలి వీరవెంకటసత్యనారాయణ మూర్తిని బుధవారం సన్మానించారు. మగటపల్లి కాంప్లెక్స్‌లో జరిగిన సన్మాన సభలో ఆయన్ని సత్కరించారు.

పోస్టర్ ఆవిష్కరణ

మలికిపురం: చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను ఎంఈఓ విజయశ్రీ బట్టేలంక ఉన్నత పాఠశాల ఆవరణలో ఆవిష్కరించారు. మండల శాఖ అధ్యక్షుడు పీవీవీ వరప్రసాద్ మాట్లాడుతూ చెకుముకి పరీక్ష పాఠశాల స్థాయిలో 25న ఉంటాయన్నారు.


నేడు గ్రామస్తుల ర్యాలీ

సఖినేటిపల్లి: అంతర్వేది దేవస్థానంలో ఎన్‌జీటీ తీర్పును అమలు చేయాలని గురువారం గ్రామస్తులు తలపెట్టిన ర్యాలీని విజయవంతం చేయాలని నియోజకవర్గ జంతువులు, పక్షులు, పర్యావరణ పరిరక్షణ టీమ్ సభ్యులు పిలుపు నిచ్చారు.

చిన్నారులకు టీకాలు తప్పనిసరి

ఆలమూరు: చిన్నారులకు విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ డాక్టర్లు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధి సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చిన్నారులకు టీకాలు వేశారు.

పరిసరాల శుభ్రతలో భాగస్వామ్యం



పాశర్లపూడిలంకలో స్వచ్ఛతా హి సేవ ర్యాలీ

మామిడికుదురు: స్వచ్ఛతా హి సేవలో భాగంగా పాశర్లపూడిలంకలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్వచ్ఛ భారత్‌లో ప్రజలు భాగస్వాములు కావాలని విద్యార్థులు నినాదాలు చేశారు. సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు, ఎంపీటీసీ చెరుకూరి పార్వతి, కార్యదర్శి సురేష్, వీఆర్వో రాయుడు పాల్గొన్నారు. గ్రామంలో దోమల నిర్మూలనకు ఎబేట్ మందును స్ప్రే చేయించారు.

అయినవిల్లి: వీరవల్లిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని జెడ్పీటీసీ సభ్యుడు గన్నవరపు శ్రీనివాసరావు ప్రారంభించారు. పంచాయతీ విస్తరణాధికారి వాణిశ్రీ బెహర, కార్యదర్శి రవి తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట: చిరతపూడిలో సర్పంచ్ బేబిరాణి ఆధ్వర్యంలో కార్యదర్శి వెంకట్ అధ్యక్షతన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. వైస్ ఎంపీపీ నేతల నాగరాజు పాల్గొన్నారు.